RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 285 పేజీలు - 08 బుధవారం 09 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక




# కేసీఆర్ హత్యకు కుట్రలు : కేటీఆర్



- ఎర్రవెల్లి టూ బోయిన్‌పల్లివరకు రాజకీయ కాక
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నేతలు
- అడ్డుకున్న పోలీసులు..?మాజీ సీఎం వ్యవసాయ క్షేత్రం చుట్టూ పహారా
- కేసీఆర్‌కు రక్షణగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు
- రెండు పార్టీల పరస్పర నిరసనలతో ఉద్రిక్తత
- బీఆర్ఎస్ ముఖ్యనేతలను అరెస్టు చేసిన పోలీసులు
- పోలీసుల అదుపులో కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు..సాయంత్రానికి విడుదల
- పాలక, ప్రతిపక్షాలకు వేర్వేరు నిబంధనలా?: హరీశ్‌రావు

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 08:** అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బ్లాక్ టీషర్ట్స్‌తో మొదలెట్టిన నిరసన.. అటు ఇటు తిరిగి చివరకు మంగళ వారం కేసీఆర్ ఫామ్‌హోస్‌ను కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ముట్టడించే వరకు వెళ్లింది. ఇరుపార్టీల కార్యకర్తల ఆందోళనలతో ఎర్రవెల్లి రణక్షేత్రంగా మారింది. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని ముట్టడించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎర్రవెల్లికి తరలివచ్చారు. మర్కుక్ మండలం వరదరాజ్‌పూర్ గ్రామం వైపు నుంచి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఫామ్‌హౌస్ వైపు కదిలారు. పార్టీ జెండాలు పట్టుకుని, డప్పుల మోతల మధ్య కార్యకర్తలు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. 'కేసీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎర్రవల్లి పరిసరాలు రాజకీయ నినాదాలతో మార్మోగాయి. కాగా వరదరాజపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.

**భారీగా పోలీసుల మోహరింపు** కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నిరసనకారులు ముందుకు వెళ్లకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు.

**గజ్వేల్‌లో సైతం ఉద్రిక్తత** కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు, పార్టీ శ్రేణులు గజ్వేల్ నుంచి డప్పులతో ఫామ్ హౌస్ వైపు పెద్దఎత్తున బయల్దేరారు. దాంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అలాగే కేసీఆర్‌కు రక్షణగా వెళ్తున్న మిగతా2లో...

# మీ తల్లిని కాదు.. నా తల్లిని అన్నారు

- ఆవేశం మీకు కాదు.. నాకుండాలి హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం
- మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సమాధానం ?చెప్పాలన్న బీఆర్ఎస్
- ఘటనపై పూర్తి నివేదిక కోరామన్న శ్రీధర్ బాబు
- నివేదిక వచ్చిన తర్వాత చర్యలుంటాయన్న స్పీకర్
- స్పీకర్ పై వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్
- స్పీకర్ అంటే తమకు చాలా గౌరవం ఉందన్న హరీశ్ రావు
- తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అలా మాట్లాడలేదు
- స్పీకర్ అలా భావిస్తే విచారం వ్యక్తం చేస్తున్నామన్న హరీశ్
- పోలీసులపై కేటీఆర్ దాడి చేశారన్న మంత్రి సీతక్క
- ఈ వివాదాలను ఇంతటితో ఆపాలన్న ఏలేటి
- శాసన సభలోవాడీ వేడి చర్చ

## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు..



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 08:** తెలుగు రాష్ట్రా ల్లో మంగళవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలో అనేక జిల్లాల్లో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, ఉత్తర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు, ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మత్స్య కారులు తీరప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి




## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

● సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు ● ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం




## స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..




## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

- నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి




## తెలంగాణలో 17 మంది డిఎస్‌పిల బదిలీ



# మీ తల్లిని కాదు.. నా తల్లిని అన్నారు

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 08:**రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన ఘటనలపై మంగళవారం కూడా సభలో వాగ్యుద్ధం జరిగింది. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి అంటూ..ఒక దశలో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో రోజు సభ ప్రారంభమైన వెంటనే నల్లబ్యాడ్జీలతో బీఆర్ఎస్ సభ్యులు హాజరయ్యారు. సీనియర్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆవేశంగా మాట్లాడారు. రాష్ట్రంలోని యావత్ మహిళలపై జరిగిన దాడిగా దీన్ని పరిగణిస్తున్నామన్నారు. " కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. గౌరవ సభ.. కౌరవ సభగా మారింది. ఆనాడు కౌరవులకు పట్టిన గతే రేపు.. కాంగ్రెస్ పార్టీకి పడుతుంది" అని తీవ్రంగా విమర్శించారు.స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని.. హరీశ్‌రావు వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. "మహిళా సభ్యులంటే సభతో పాటు నాకు కూడా గౌరవం ఉంది. మీరు చెబితే నేను వినట్లేదా.. ఎందుకంత ఆవేశం. మీకు కాదు ఆవేశం.. నాకు ఉండాలి. నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మి పట్ల తనకు కూడా గౌరవం ఉందన్నారు. నాకున్న ఎనిమిది మంది అక్కా చెల్లెళ్లతో పాటు వారు కూడా తన సోదరీమణులేనని పేర్కొన్నారు. మహిళా సభ్యులపై దురుసు ప్రవర్తనకు సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని స్పీకర్ స్పష్టంచేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మహిళా సభ్యులపై జరిగిన ఘటనపై రిపోర్ట్ ఇవ్వాలని స్పీకర్ పోలీసులను ఆదేశించారని వివరించారు. మహిళల పట్ల గౌరవం మాకూ ఉందన్నారు. తప్పు జరిగితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్పీకర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ సభ్యులు ఎందుకు ఖండించలేదని నిలదీశారు. స్పీకర్‌ను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సభను ఎలా నడపాలనే అంశంపై బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు అని చెప్పడానికి వాళ్లెవరు..?అని ప్రశ్నించారు. అనుకుంటే.. భావిస్తే ఏంటి.. వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది కదా?అని హరీశ్‌రావును ఉద్దేశించి ప్రశ్నించారు... మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఆదేశించారు.. స్పీకర్‌పై జరిగినదాన్ని పక్కనపెట్టాలని చెప్పటంతోనే ఆ ఘటనను వీరు ఎంత లైట్‌గా తీసుకుంటున్నారో అర్థమవుతుందని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని బీఆర్ఎస్ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ గేట్ దగ్గర మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టింది ఎవరూ.. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పింది ఎవరని ప్రశ్నించారు. స్పీకర్‌ను ఆయన తల్లిని దూషించి ఇప్పుడు లేదని దబాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పోలీసులపై దాడులు చేయడం సబబేనా అనినిలదీశారు. అసెంబ్లీలో రూల్ తెచ్చిందే మీరు.. మీరే పాటించరా అని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లకారం భాషతో సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక, తమ చీర లాగారు.. కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చెబుతున్నారు.. నిజంగా మహిళా సభ్యులపై దాడి జరిగితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కూడా కేసులు పెడతామని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ స్పీకర్‌ను అవమానిస్తే సహించబోమన్నారు. ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఆ వ్యాఖ్యలపట్ల వారికి కనీస పశ్చాత్తాపమే లేదన్నారు. స్పీకర్ పదవిని అవమానించడం అంటే రాజ్యాంగ వ్యవస్థనే అవమానించడమన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు మాకు కూడా సోదరీమణులే.. వారిపై దాడిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించమని చెప్పారు. ఒకవైపు మహిళలపై జరిగిన ఘటనపై విచారణ కోరుతూ.. మరోవైపు స్పీకర్‌పై వ్యాఖ్యలను సమర్థించడం ఏ న్యాయం?అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో అణగారిన వర్గాల ప్రజలు కూడా ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ స్థానంలో ఉండడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేక పోతోందా?అని ప్రశ్నించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా వ్యవహరించడం బాధాకరమన్నారు. దళిత సంఘాలు, ప్రజాసంఘాలు స్పీకర్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు న్యాయని గుర్తు చేశారు. ఇదే అంశంపై ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యే అనురిద్‌రెడ్డి మాట్లాడారు.బీజేపీ సభ్యులు 22ఏపై చర్చించాలని పట్టుబట్టారు. ప్రజా సమస్యలు చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పోడియం ముందు బైటాయించారు. మంత్రి జోక్యం చేసుకుని ఆ అంశంపై ప్రత్యేక చర్చ ఉందని చెప్పారు. వారు, వీరు కలిసి లోపాయికారి ఒప్పందంతో స్పీకర్‌పై జరిగిన దాడిని పక్కదారి పట్టిస్తున్నారనిబీజేపీసభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 08:** తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటు చేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది.

బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు.

కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# కేసీఆర్ హత్యకు కుట్రలు : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, శ్రీగిరిపల్లి, గణేష్‌పల్లి, అల్లిరాజ్ పేట్, సింగరాయపల్లి చౌరస్తా, గౌరారం, పాములపర్తిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు ఇరు పార్టీల శ్రేణులను చెదరగొట్టారు. **కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేల అడ్డగింత** ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయల్దేరడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న వారిని హకీంపేట, బొల్లారం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాణిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులను జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు విషయం తెలియడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్లకు తరలివచ్చారు.హకీంపేట వద్ద బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పర్యవేక్షణలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి నివాసం వద్ద భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

**ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి : కేటీఆర్** ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు, అరెస్టులకు పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించిన తీరును ఖండించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ.2,500, ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. హామీల అమలుపై అసెంబ్లీలో ప్రశ్నించాలని కేసీఆర్ తమకు సూచించారని తెలిపారు. సోమవారం అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని, మంగళవారం కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవెల్లి వెళ్తుంటే అడ్డుకున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారన్నారు.

**పాలక పక్షానికి.. ప్రతిపక్షానికి వేర్వేరు నిబంధనలా? : హరీశ్‌రావు** పాలక పక్షానికి, ప్రతిపక్షానికి వేర్వేరు నిబంధనలు ఉన్నాయా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నాయకులను ఎర్రవెల్లి వెళ్లకుండా అడ్డుకుంటూ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను మాత్రం అనుమతిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసే హక్కు తమకు ఉందని, ఎర్రవెల్లి వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో పోలీసులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతల అరెస్టులతో ఆయా పోలీస్‌స్టేషన్ల వద్ద పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి నాయకులను వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు.

## స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 08:**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కలిసి పరామర్శించారు. సోమవారం అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల నేపథ్యంలో స్పీకర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు కలిశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం కంట తడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టిలు స్పీకర్‌ను పరామర్శించి, ఓదార్చారు. సోమవారం జరిగిన సంఘటనలపై వారిద్దరూ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్‌కు వారు హామీనిచ్చారు.

## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 08:**తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 08:**తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ ఛైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

## గణేశ్ మండపాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: సజ్జనార్



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 08:** గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ స్పష్టం చేశారు. గణేశ్ మండపాల వివరాలను ఉత్సవ నిర్వాహకులు ముందస్తుగానే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్వాహకులు పోలీస్‌పోర్టల్. టిఎస్‌పోలీస్.జిఓవి.ఇన్/ఇన్‌డెక్స్. హెచ్‌టిఎం పోర్టల్‌ను సందర్శించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అధికారిక పోర్టల్ ద్వారా సమాచారం అందించి హైదరాబాద్ సిటీ పోలీస్ కు సహకరించాలని కోరారు. మండపాల ఏర్పాటు, నిమజ్జన వివరాలు ముందుగానే తెలిస్తే ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, తగిన భద్రతాను పోలీసులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

## తెలంగాణలో 17 మంది డిఎస్‌పిల బదిలీ



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 08:** రాష్ట్ర పోలీసు శాఖలో 17 మంది డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి)లకు బదిలీలు, పోస్టింగులు కల్పిస్తూ డిజిపి సి.వి ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫారసుల మేరకు ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన అధికారులను సంబంధిత యూనిట్ అధికారులు వెంటనే రిలీవ్ చేసి, కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో విధుల్లో చేరేలా ఆదేశాలు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డిఎస్‌పి కె. బాలకృష్ణారెడ్డిని మల్కాజిగిరి సైబర్ క్రైమ్స్ ఏసిపిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్.జీ. శివశంకర్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.ఎస్‌కె. అబ్దుల్ రహ్మాన్‌ను జయశంకర్ భూపాలపల్లి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా నియమించారు. ఏ. రవి కుమార్‌ను జగిత్యాల డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. బి. నందిరామ్ నాయక్‌ను డిజిపి కార్యాలయంలోని డిజి కంట్రోల్ రూమ్ డిఎస్‌పిగా, బి. సోమ్నారాయణ్ సింగ్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. జె. వెంకటేశ్వర్‌రావును మెదక్ డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా, బి. కిషన్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎల్. రమేశ్ కుమార్‌ను హైదరాబాద్ సిటీ సిటిసి ఏసిపిగా నియమించారు. ఎన్. శ్రీనివాస్‌రెడ్డికిసంగారెడ్డి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు.కదరు వెంకట్‌రెడ్డిని టిజిపిఏ డిఎస్‌పిగా నియమించారు. కొమట్ల సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎస్. సుదర్శన్‌ని హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా నియమించారు. ఎన్. శంకర్‌కుహైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. పీ. విజయ్ కుమార్‌ను వెస్ట్ జోన్ రోడ్ సేఫ్టీ డిఎస్‌పిగా నియమించారు. కె. భాస్కర్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎం. వెంకట నర్సయ్యను సిఐడి డిఎస్‌పిగా నియమించారు. కొత్తగా పోస్టింగ్ పొందిన అధికారులు తమ రిలీవ్ అనంతరం వెంటనే విధుల్లో చేరి, సంబంధిత ఉన్నతాధికారులకు ఛార్జ్ రిపోర్టులు సమర్పించాలని డిజిపి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# నేలపట్ల చేనేత సొసైటీపై మధ్యంతర స్టే ఆదేశాల అమలు

- ఎన్నిక, అధ్యక్షుడి నియామకంపై కోఆపరేటివ్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు..
- సొసైటీ భవనానికి నోటీసులు అంటించిన అధికారులు



**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 6:** చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని హ్యాండ్లూమ్ రివర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ఫలితాలపై కోఆపరేటివ్ ట్రిబ్యునల్ కోర్టు ఆగస్టు 5న జారీ చేసిన మధ్యంతర స్టే ఉత్తర్వులను అమలు చేయాలని చేనేత, జౌళి శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ సంచాలకులు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సొసైటీ భవనానికి ఏడీఓ గోపాల్ నోటీసులు అంటించారు.నేలపట్ల చేనేత సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన పిల్లలమర్రి శ్రీనివాస్ ఎన్నిక, అధ్యక్షుడి నియామకం చెల్లదంటూ కొంతమంది డైరెక్టర్లు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. శ్రీనివాస్‌కు ముగ్గురు సంతానం ఉన్నారని, సొసైటీ ఎన్నికల నిబంధనల ప్రకారం ఇద్దరికి మించి సంతానం ఉన్న వారు ఎన్నికల్లో పోటీ చేయరాదనే నిబంధన ఉందని వారు పేర్కొన్నారు.ఈ అంశంపై విచారణ జరిపిన కోఆపరేటివ్ ట్రిబ్యునల్ కోర్టు ఆగస్టు 5, 2026న పిల్లలమర్రి శ్రీనివాస్ ఎన్నికతో పాటు చైర్మన్‌గా ఆయన నియామకంపై మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ కమిషనర్ ఆదేశాల మేరకు సొసైటీ భవనానికి నోటీసులు అంటించినట్లు ఏడీఓ గోపాల్ వెల్లడించారు.అదేవిధంగా పిల్లలమర్రి శ్రీనివాస్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా నోటీసు పంపించినట్లు తెలిపారు. తదుపరి న్యాయస్థాన ఉత్తర్వులు వెలువడే వరకు సొసైటీలో మధ్యంతర స్టే ఆదేశాలను అమలు చేస్తూ, ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా వ్యవహరించాలని సొసైటీ కార్యదర్శికి సూచించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గంజి శ్రీనివాసులు, తడక కోటేశ్వర్ పాల్గొన్నారు.

# దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8:** న్యాయ సేవాధికార సంస్థ, ఖమ్మం ఆధ్వర్యంలో ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలోలిలి దివ్యాంగుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి లిశ్రీమతి పి. దేవి మానసలి పాల్గొని దివ్యాంగులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగులు స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లిదివ్యాంగజన్ కౌశల్ వికాస్లి పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి అవకాశాలను, లిదివ్యాంగజన్ రోజ్‌గార్ సేతులి ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే లిదివ్యాంగుల హక్కుల చట్టం, 2016లి ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులు, రక్షణలు, సమాన అవకాశాల గురించి వివరించారు.దివ్యాంగుల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకొని సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం మరియు న్యాయ సలహాలి అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఎ. ప్రమీల, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదులు, సంబంధిత శాఖ సిబ్బంది మరియు దివ్యాంగులులిలి పాల్గొన్నారు.

# ఉద్యోగుల డిమాండ్ల సాధనకు 10న చలో హైదరాబాద్

- భువనగిరి జిల్లా నుంచి పది వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు
- జిల్లా ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ ధరణికోట భగత్




**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 8:** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ ధరణికోట భగత్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలన్నీ న్యాయమైనవేనని, వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు .ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్‌హక్కుల సాధన సభ'కు జిల్లా నుంచి వేలాది మంది ఉద్యోగులు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. సభకు లక్ష మందికిపైగా ఉద్యోగులు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించామని, అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి సుమారు పది వేల మంది ఉద్యోగులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.బుధవారం చౌటుప్పల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ.. వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి మూడేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం నివేదికను స్వీకరించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఆరు కరవు భత్యాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, ప్రస్తుతం అమలులో ఉన్న కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల కోసం ప్రభుత్వం జారీ చేసిన ఉద్యోగుల ఆరోగ్య పథకం ఉత్తర్వులు అమలుకు నోచుకోవడం లేదని, ప్రైవేటు ఆస్పత్రులు సైతం ఈ పథకం కింద వైద్యం అందించేందుకు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర జేఏసీ నాయకులతో పాటు మండల అభివృద్ధి అధికారులు, డివిజనల్ పరిపాలన అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యాదయ్య, రమేష్, రాములు, లింగయ్య, పంచాయతీరాజ్ శాఖకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, శశికాంత్‌గౌడ్, రమాదేవి, జిల్లా నాయకులు ఖదీర్, శ్రీకాంత్, జానయ్య, శ్రీనివాస్, పెన్షనర్ల సంఘం నాయకులు మోహన్‌రెడ్డి, బాలరాజ్ పాల్గొన్నారు.

# రియల్టర్ ప్రయోజనాల కోసం పూర్వీకుల భూమికి ఎసరు? (22 ఎ) బాధితుడు

**తప్పు సరిదిద్ది నూతన పాస్ బుక్ ఇవ్వాలి**

**ఒకే పహాణీలో రెండు రకాల ఎంట్రీలు.. అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణకు డిమాండ్**

**ఎరుకల భీమయ్య గౌడ్ 22ఎ బాధితుడు**





**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 6:** పూర్వీకుల నుంచి సంక్రమించిన వ్యవసాయ భూమిని రియల్టర్ ప్రయోజనాల కోసం తప్పుడు రికార్డులతో వివాదాస్పదం చేశారంటూ 90 ఏళ్ల వృద్ధుడు ఎరుకల భీమయ్య గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికారుల నిర్లక్ష్యం, తప్పుడు నమోదుల కారణంగా సంవత్సరాలుగా న్యాయం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.చౌటుప్పల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 6లోని 1 ఎకరం 07 గుంటల పూర్వీకుల భూమిని పూర్వపు వీఆర్వోలు ఒకే కాలానికి సంబంధించిన పహాణీల్లో ఒకచోట వ్యవసాయ భూమిగా, మరోచోట 'పీడబ్ల్యూడీ రోడ్డు'గా నమోదు చేశారని భీమయ్య గౌడ్ ఆరోపించారు. ఈ తప్పుడు ఎంట్రీల వెనుక రియల్టర్ లకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశం ఉందని ఆయన ఆరోపించారు.**'రోడ్డు' ఎక్కడ.. భూసేకరణ ఎక్కడ?**తన భూమిని పీడబ్ల్యూడీ రోడ్డుగా పేర్కొన్నప్పటికీ అక్కడ ఎలాంటి రోడ్డు లేదని, రోడ్డు నిర్మాణం కోసం ఎలాంటి భూసేకరణ జరగలేదని ఆర్అండ్‌బీ అధికారులు నివేదిక ఇచ్చినట్లు భీమయ్య గౌడ్ తెలిపారు. అదేవిధంగా ఎంఆర్ఓ కార్యాలయంలో భూసేకరణకు సంబంధించిన ఎలాంటి నమోదు లేదని, ఉమ్మడి జిల్లా ల్యాండ్ సెక్షన్ కార్యాలయం నుంచి కూడా భూసేకరణ జరగలేదని నివేదికలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.ఇక ఏడీ భువనగిరి, ఆర్డీవో సర్వేయర్ చౌటుప్పల్, మండల సర్వేయర్ చౌటుప్పల్ అధికారులు నిర్వహించిన సర్వేలో టిప్పన్, సేత్వార్ రికార్డుల ప్రకారం భూమి ఉన్నట్లు నివేదికలు ఇచ్చారని భీమయ్య గౌడ్ తెలిపారు.**ధర్నాతో దిగొచ్చిన అధికారులు.. హామీ మాత్రం అమలు కాలేదా?**తన సమస్యను పరిష్కరించేందుకు గతంలో ఎన్నిసార్లు అధికారులను కలిసినా స్పందన లేకపోవడంతో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అప్పటి ఆర్డీవో సూరజ్‌కుమార్ తప్పును సరిదిద్ది పాస్‌బుక్ అందజేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించినట్లు చెప్పారు.అయితే హామీ ఇచ్చి చాలాకాలం గడిచినా సమస్య పరిష్కారం కాకపోవడంతో మళ్లీ అధికారుల చుట్టూ తిరగలేక విసిగిపోయి తాజాగా జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. పూర్తి రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని భీమయ్య గౌడ్ వెల్లడించారు.**తప్పుడు ఎంట్రీలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**రియల్టర్ల ప్రయోజనాల కోసం అధికారుల స్థాయిలో తప్పుడు రికార్డులు సృష్టించారా? అనే కోణంలో సమగ్ర విచారణ జరపాలని భీమయ్య గౌడ్ డిమాండ్ చేశారు. పహాణీల్లో తప్పుడు ఎంట్రీలు చేసినట్లు విచారణలో తేలితే సంబంధిత వీఆర్వోలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.తాను 90 ఏళ్ల వృద్ధుడినని, ప్రభుత్వం గుర్తించిన కళాకారుడినని, పూర్వీకుల నుంచి వచ్చిన భూమి కోసం జీవిత చరమాంకంలోనూ అధికారుల చుట్టూ తిరగాల్సి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.భూమికి సంబంధించిన అన్ని ఒరిజినల్ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, తప్పుడు నమోదుల వెనుక ఎవరున్నారో తేల్చి, బాధితుడికి న్యాయం చేయాలని ఎరుకల భీమయ్య గౌడ్ అధికారులను వేడుకున్నారు.

# శాసన మండలి నుంచి తాతా మధును బర్తరఫ్ చేయాలి...

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మిగౌడ్**





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 8:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఆక్షేపమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును శాసన మండలి సభ్యత్వాని నుండి తక్షణమే బర్తరఫ్ చేయాలని కేసముద్రం మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సమ్మిగౌడ్ తీవ్రంగా డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన నిర్వహించారు.ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. స్పీకర్ పదవికి, దళిత సమాజానికి వ్యతిరేకంగా మాట్లాడటం రాజ్యాంగ విలువలను తీవ్రంగా అవమానించడమేనని నినాదాలు చేశారు.అనంతరం సీనియర్ నాయకులు మాట్లాడుతూ...తాతామధును వెంటనే శాసనమండలి నుండి భర్తరప్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ మాట్లాడుతూ..."ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన తీరు అత్యంత హేయమైనదన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను, ప్రజాస్వామ్య పద్ధతులను కించపరిచే హక్కు ఎవరికీ లేదని తెలిపారు. తాతా మధుపై తక్షణమే అనర్హత వేటు వేసి, శాసన మండలి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. చట్టపరంగా ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ స్థానానికి ప్రత్యేక గౌరవం ఉంటుందని, అలాంటి పదవిలో ఉన్న దళిత నేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని స్థానిక కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ పదవికి తాతా మధు అనర్హుడని, ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంబటి మహేందర్ రెడ్డి, అల్లం నాగేశ్వరరావు,రావుల మురళి, బండారు వెంకన్న, కదిర సురేందర్, వల్లందాసు రవి, తరాల వీరేష్,రాంబాబు,రడెం వెంకన్న, రడెం శ్రీనివాస్,పోలెపాక నాగరాజు, ఆయూబ్ ఖాన్, శ్రీహరి, దామరకోండ ప్రవీణ్,సామల నరసయ్య,కొలిపాక వెంకన్న, వివిధ గ్రామాల సర్పంచ్ లు,గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువకుడిపై దాడి.. యాసిడ్ లాంటి ద్రవంతో కాలిన గాయాలు

**స్నేహితులే దాడి చేశారని ఫిర్యాదు..**

**ఉస్మానియా ఆస్పత్రిలో తీవ్ర చికిత్స**

**జీ. మన్మధ కుమార్ పోలీసు ఇన్‌స్పెక్టర్, చౌటుప్పల్**






**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 8:**చౌటుప్పల్‌లో యువకుడిపై కొందరు వ్యక్తులు దాడి చేసి, గుర్తుతెలియని ద్రవం పోయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వలిగొండ రోడ్డుకు చెందిన షేక్ గౌస్ (19) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.సెప్టెంబర్ 7న మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో అతని స్నేహితుడు బుడ్డా వినయ్ బయటకు తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం వినయ్‌తో పాటు మరికొందరు కలిసి మద్యం సేవించినట్లు, ఆ తర్వాత తనపై దాడి చేసి తీవ్రంగా కొట్టినట్లు గౌస్ తన అన్న షేక్ హైమద్‌కు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.మార్కండేయ నగర్‌లోని గంగోత్రి నీటి శుద్ధి కేంద్రం సమీపంలో తనపై దాడి చేసి, యాసిడ్ లేదా మరేదైనా గుర్తుతెలియని ద్రవాన్ని పోశారని గౌస్ తన అన్నకు ఫోన్‌లో చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనలో అతని ఎడమ చెంప నుంచి తల, చెవి వరకు తీవ్ర కాలిన గాయాలు, ఎడమ ఛాతీ, ఎడమ భుజం, రెండు చేతులు, తొడ భాగాల్లో కాలిన గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు.దాడి అనంతరం భయంతో అక్కడి నుంచి పరుగెత్తుకుంటూ వచ్చిన గౌస్ కేసీఆర్ కాలనీ భారత్ పెట్రోల్ బంకు సమీపంలోని ఓ ఇంట్లో ఆశ్రయం పొందాడు. అనంతరం కుటుంబ సభ్యులు అతడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు అక్కడ తీవ్ర చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై గౌస్ అన్న షేక్ హైమద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తులో తేల్చునున్నట్లు పోలీసులు తెలిపారు.

# వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత జరుపుకోవాలి...


**- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 08:** జిల్లాలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి, వినాయక నిమజ్జన వేడుకలపై రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జన ఘాట్ల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా రూట్ డైవర్షన్ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులను షిఫ్టుల వారీగా నియమించాలి. ఊరేగింపు మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సంబంధిత శాఖల వారు సరిచేసి, ఎత్తు పెంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్‌తో పాటు ఘాట్ల వద్ద అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలగకుండా, క్రేన్లు సులభంగా నిలిచేందుకు మరియు విగ్రహాలు నీటిలో సరిగ్గా మునిగేందుకు నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు నిమజ్జనం జరిగే చెరువులు, జలాశయాలు లేదా కాలువల్లో తగినంత నీటి మట్టం ఉందో లేదో పర్యవేక్షించి మండల అధికారులను సమన్వయం చేసుకొని నివేదికలు అందజేయాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఘాట్ల వద్ద బలమైన బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను మోహరించాలన్నారు. అగ్నిమాపక శకటాలను (ఫైర్ ఇంజిన్లు) ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. మండప నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయిన తరువాత ఘాట్ల వద్ద, ప్రధాన రహదారులపై మున్సిపల్ మరియు పంచాయతీ సిబ్బంది సహాయంతో మట్టి, వ్యర్థాలు, పూజా సామగ్రిని తొలగించి శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ. నాగావాణి, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు రాజేశ్వరీ, గణేష్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల స్వావలంబనకు 'కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం'

- ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణకు శ్రీకారం
- మహిళలకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలే లక్ష్యం
- బొల్ల శివశంకర్ మాజీ జడ్పిటిసి. మునుగోడు నియోజకవర్గం



**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 8:** మహిళలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించి, ఆర్థికంగా స్వావలంబులను చేయాలనే లక్ష్యంతో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. "నైపుణ్యం.. ఆత్మనిర్భరత.. ఆత్మవిశ్వాసం" అనే లక్ష్యంతో మహిళలకు కుట్టుపనిలో శిక్షణ అందించనున్నారు. కుట్టు మిషన్ శిక్షణ ద్వారా మహిళలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు స్వయం ఉపాధి పొందేందుకు, కుటుంబ ఆర్థిక పరిస్థితికి అండగా నిలిచేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి మెరుగైన భవిష్యత్తు అందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ నెల 9వ తేదీన ఉదయం 11 గంటలకు శిక్షణ కేంద్రం ప్రారంభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలోని సేవిత సహకార సంఘ భవనం వద్ద కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ఆసరా ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. "మహిళ సాధికారత.. సమాజ అభివృద్ధికి మూలాధారం" అనే సందేశంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# తాతయ్య భూక్య రాజ్య పేరు మీదుగా సూర్య యూత్ వారికి డప్పుల బహుకరణ

**- బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్.**




**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 8:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ వారి యొక్క తాతగారైన భూక్యరాజ్య మరియు బోడ రామకోటి నాయక్ వారి మామగారైన బోడ లింగం ల పేరట బంజరుపెల్లి దళిత బిడ్డలు అయినటువంటి సూర్య యూత్ (ఎస్సీ కాలనీ )వాసులకు డప్పులు మరియు డ్రెస్ కోడ్ కాళ్ల గజ్జలు బహుకరించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఒర్రె మహేశ్వరి– రాజు, భూక్య మౌనిక రాజ్ కుమార్, బోడ స్వాతి అనిల్, మంద ఉప్ప స్వామి, కొంగ శ్రీనివాస్, కొనుకటి రామ్ చందర్, సీనియర్ నాయకులు జనగాం వెంకటేశ్వర్లు తడుగుల సాంబరాజు బోడ భాస్కర్ ఎస్సీ కాలనీ వాసులు బాబు మాచర్ల భాస్కర్ తడుగుల సునీల్ మాంకాల క్రాంతి మాదాసి విక్రమ్ తడుగుల సదానందం తడుగుల అనిల్ తడుగుల వీరస్వామి మహేష్ వరప్రసాద్ గ్రామస్తులు అందరూ పాల్గొనడం జరిగింది.

# దళిత స్పీకర్‌పై బిఆర్ఎస్ పార్టీ చిల్లర రాజకీయాలు.

**నెక్కొండలో తాతా మధు దిష్టి బొమ్మ దహనం.**

**టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి.**





**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 8:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత స్పీకర్‌పై బీ ఆర్ ఎస్ చిల్లర రాజకీయాలు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాలతో నెక్కొండ మండల కేంద్రంలో తాతా మధు గదిష్టిబొమ్మ దహనం చేసిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి. తెలంగాణ శాసనసభ వేదికగా జరిగిన పరిణామాలు, ఆ తర్వాత వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో చెలరేగిన రాజకీయ నిరసనలపై నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. దేవాలయం లాంటి తెలంగాణ అసెంబ్లీలో, అత్యున్నత స్థానంలో ఉన్న దళిత బిడ్డ, స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ ని ఉద్దేశించి బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత విచారకరమని సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. బి ఆర్ ఎస్ నాయకులు పూర్తిగా విచక్షణ కోల్పోయి సభా మర్యాదలను, ప్రజాస్వామ్య సూత్రాలను తుంగలో తొక్కారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఒకదళిత నాయకుడు స్పీకర్ స్థానంలో కూర్చుంటే ఓర్వలేక బిఆర్ఎస్ శ్రేణులు ఇలాంటి దుర్మార్గానికి ఒడిగట్టాయని, ఇది కేవలం స్పీకర్ ని మాత్రమే కాకుండా యావత్ తెలంగాణ ప్రజలను, దళిత సమాజాన్ని అవమానించడమేనని సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి స్పష్టం చేశారు. గత పదేళ్ల పాలనలో దళితులకు ముఖ్యమంత్రి పదవి, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వంటి ఏ ఒక్క హామీని నెరవేర్చని బి ఆర్ యస్ నాయకులు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే ఓర్వలేకపోతున్నారని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమై ప్రజల సొమ్మును వృథా చేస్తుంటే, ఆయన అనుచరులు మాత్రం సభ బయట నాటకాలాడుతూ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాలకు అనుగుణంగా, టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ కేంద్రంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. నెక్కొండ ప్రధాన కూడలిలో ధర్నా చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు బి ఆర్ ఎస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశాయి. సభా హుందాతనాన్ని దెబ్బతీసి, దళిత వర్గాన్ని అవమానించినందుకు గాను బి ఆర్ ఎస్ అధిష్టానం మరియు తాతా మధు తెలంగాణ ప్రజలకు, దళిత సమాజానికి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ సొసైటీ చైర్మన్స్ మాదటి శ్రీనివాస్ ఆవుల శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు మార్కెట్ డైరెక్టర్స్ రావుల మహిపాల్ రెడ్డి బొమ్మెరబోయిన రమేష్ ఉపాధ్యక్షులు గరికపాటి హన్మంత్ రావు కృష్ణ రావు సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి సర్పంచ్ లు భూక్యా రమేష్ బానోత్ రవి ఎన్ ఎస్ యు ఐ బోడ శ్రీకాంత్ బానోత్ శ్రీకాంత్ ఇదునూరి ప్రభాకర్ వనం యాకంతం చెన్నకేశవులు ఇదునూరి శివాజి కక్కెర్ల ఐలయ్య రావుల రాజు బానోత్ వీరన్న మూసినా సారయ్య పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశంలో పాల్గొన్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 8:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నూతన గృహప్రవేశ కార్యక్రమం లో పాలుగోని శుభాకాంక్షలు తెలిపిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ కొమ్ము రమేష్ యాదవ్‌వెంకటాపురం గ్రామనికి చెందిన బి ఆర్ ఎస్ వార్డ్ సభ్యులు నేరెళ్ల రమేష్ –శ్రీలత దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ కొమ్ము రమేష్ యాదవ్, నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ –దేవనబోయిన వీరభద్రం, నాయకులు ఇదునూరి వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ నాయకులు ఐలయ్య, పాము రాజేష్, సురేష్, ఆకులపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌ను అవమానిస్తారా? ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌కు చావు డప్పుతో కాంగ్రెస్ హెచ్చరిక



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రామన్నపేటలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించింది. ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆధ్వర్యంలో రామన్నపేట కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి చావు డప్పు వాయిస్తూ బయలుదేరారు. ఈ సందర్భంగా విప్ వేముల వీరేశం మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత వ్యక్తిని బీఆర్ఎస్ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడటం దళిత సమాజాన్ని అవమానించడమే. కేసీఆర్, కేటీఆర్ లు తమ నాయకులను అదుపులో పెట్టుకోవాలి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం వేరు, వ్యక్తిగతంగా దూషించడం వేరు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు" అని హెచ్చరించారు. అసెంబ్లీ స్పీకర్ పట్ల బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు అహంకారానికి నిదర్శనమని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ సెల్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బండి సంజయ్‌ని కలిసిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్




**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8:** ఉమ్మడి ఖమ్మం జిల్లాల పర్యటన లో భాగంగా మంగళవారం రాత్రి ఖమ్మం NSP గెస్ట్ హౌజ్ కు విచ్చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్

# యాదవుల మేక పోతుల బండి...
# ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణ

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: న్యూ శాయంపేట,తెలంగాణ రాష్ట్రంలోని ఆ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు,ప్రత్యేకత ఉంది.వివరాల్లోకి వెళితే తెలంగాణ రాష్ట్ర మంతటా పోచమ్మ తల్లి బోనాలు శ్రావణం మాసం ప్రారంభం నుండి నెలలో చివరి బుధవారం వరకు జరుపుకుంటారు. కానీ గ్రేటర్ వరంగల్ పరిధిలోని 31 డివిజన్ న్యూ శాయంపేట గ్రామంలో శ్రావణమాసం చివరి గురువారం జరుపుకోవడం ఈ గ్రామానికి ఉన్న ప్రత్యేకత కొన్ని వందల ఏళ్లుగా రాష్ట్రంలోని అన్ని పోచమ్మ పండగలు అయిపోయాకే చివరిగా నువ్వు శాయంపేట గ్రామంలోని ఊరు చివరన ఉన్న స్వయంభు పోచమ్మ తల్లి బోనాలు జరుపుకోవడం ఆగ్రామానికి ఉన్న ప్రత్యేకతగా చెప్పవచ్చు న్యూ శాయంపేటలో ఉన్న అన్ని కులాల వారు ఒకే రోజు పోచమ్మ తల్లి బోనాలను సమర్పిస్తారు.తెలంగాణ రాష్ట్రంలో దసరా పండుగను ఏవిధం గానైతే తెలంగాణ ప్రజలు జరుపుకుంటారో అదేవిధంగా గ్రామ గ్రామవాసులు ఆడపడుచులను బంధుమిత్రులను ఆహ్వానించుకొని,పెద్ద జాతరలా చిన్న పెద్ద అందరు కలిసి అమ్మవారి కి మొక్కులు సమర్పించి ఆశీర్వాదం తీసుకుంటారు.పోచమ్మతల్లి బోనాలకి న్యూ శాయంపేట గ్రామం నుండి కాకుండా హనుమకొండ వరంగల్ నగరాల్లోని పోచమ్మ తల్లి భక్తులు వేలాదిగా పాల్గొంటారు.న్యూ శాయంపేట గ్రామం నగరంలో ఉన్నా కూడా ఓ గ్రామీణ వాతావరణాన్ని పోలి ఉంటుంది గ్రామస్తులందరు కూడా...వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు.కుమ్మరులే పూజారులు కొన్ని వందల ఏళ్లుగా పోచమ్మ తల్లి కి కుమ్మరులే పూజారులుగా (శాలివాహనులు) కొనసాగుతున్నారు.అమ్మవారి ప్రతిమను కుమ్మరి ల తోపాటు గ్రామ పెద్దలు అన్ని కులాల వారు అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్ళి పండగ రథయాత్ర





జరుపుతారు.ప్రత్యేకతగా మేకపోతుల బండి పోచమ్మ తల్లి బోనాల్లో భాగంగా న్యూ శాయంపేటకు చెందిన యాదవులు మేకపోతుల బండిని కట్టి ఊరేగింపుగా తీసుకెళ్తారు.మేక పోతుల బండి... ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గ్రామస్తులంతా కుటుంబ సభ్యులతో కలిసి డప్పు చప్పుళ్లతో అమ్మవారికి బోనాలను సమర్పిస్తారు.పకడ్బందీగా ఏర్పాట్లు తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలంగాణ రాష్ట్రంలోనే శ్రావణమాసం చివరి గురువారం నాడు పోచమ్మ తల్లి బోనాలను న్యూ శాయంపేట గ్రామంలో అంగరంగ వైభవంగా.. జరుపునేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని 31 డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు.కోరిన కోరికలు తీర్చే పోచమ్మ తల్లి పండగ తమ గ్రామానికి అంతటికీ ఓ పండగ వాతావరణంలా ఉంటుందని...గ్రామంలోని అన్ని కులాలవారు పిల్లాపాపలతో బంధుమిత్రులతో అమ్మవారి దర్శనాన్ని చేసుకుంటారని,కోరిన కోరికలు తీర్చే పోచమ్మ తల్లికి బోనాలతో పాటు,మేకలు గొర్రెలు కోళ్లను బలి ఇస్తారని అన్నారు.పోచమ్మ తల్లి జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి త్రాగునీరు,పోలీస్ వారి సహకారంతో బారికేడ్లు ,బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు,గ్రామంలోని అన్ని కులాల పెద్ద మనుషులతో పాటు,మాజీ కార్పొరేటర్లు మాడిశెట్టి శివశంకర్,వెల్పుల మోహన్ రావు ల సహకారంతో అన్ని రకాలుగా సిద్ధం చేసినట్లు తెలిపారు.పోచమ్మ తల్లి దర్శనానికి వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుందని,ఇప్పటికే హనుమకొండ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ నరసింహ రావు,సుబేదారి సిఐ రంజిత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు.స్థానిక ఎమ్మెల్యే నాయన రాజేందర్ రెడ్డి,ఎంపీ కడియం కావ్య,ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులుకు కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆహ్వానం పలికారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య ల సహకారంతో 31వ డివిజన్‌లోని పోచమ్మతల్లి దేవాలయ ప్రాంతం వెడల్పు దేవాలయానికి వెళ్లే రహదారి వెడల్పు, పర్మినెంట్ గ్రిల్స్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. డివిజన్ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి,కార్పొరేటర్ మామిండ్ల రాజు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

---

# సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్

### ఉద్యోగుల హక్కుల సాధన సభ విజయవంతం చేయాలి

### టి జి ఈ జాక్ వరంగల్ జిల్లా

### చైర్మన్ గాజె వేణుగోపాల్

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: రాష్ట్ర టి జి ఈ జాక్ పిలుపుమేరకు ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో నిర్వహించే"ఉద్యోగుల హక్కుల సాధన సభ "ను విజయ వంతం చేయాలని వరంగల్ జిల్లా టి జిఈ జాక్ చైర్మన్ గాజె వేణుగోపాల్ పిలుపునిచ్చారు.వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ శాఖాధిపతుల కార్యాలయంలను సందర్శించి,అధికారులను కలిసి ఉద్యోగుల తరలింపు పై చర్చించారు.జిల్లాలోని ముఖ్య కార్యాలయములు కలెక్టర్ ఆఫీస్,డిఎంహెచ్వో,డిఇఓ,ఎంజీఎం,సహకార శాఖ,రిజిస్ట్రేషన్ శాఖ,ఐ సి డి సి,ఖజానా కార్యాలయం తదితర కార్యాలయాల్లో తిరిగి ఉద్యోగులతో సమావేశమై చలో హైదరాబాద్ కార్యక్రమం గూర్చి ఉద్యోగులను సమాయత్తం చేశారు.తదంతనరంటీఎన్జీవో భవన్లో నిర్వహించిన జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశంనకు



హాజరై,ఉద్యోగుల అపరిష్కృత సమస్యల కోసం నిర్వహించు ఉద్యోగుల హక్కుల సాధన సభ ను విజయవంతం చేయాలని అన్ని శాఖల నుంచి ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి రావాలని ముఖ్యంగా కొన్ని ప్రచార మాధ్యమాల్లో వస్తున్నటువంటి,వదంతులను నమ్మకుండా ఉద్యోగుల హక్కుల సాధన సభ యధావిధిగా కొనసాగుతుందని,పిఆర్సి అమలు,పెండింగ్ ఆర్ డి ఏ లు విడుదల,ఉద్యోగుల పెండింగ్ బకాయిల విడుదల,ఈ హెచ్ఎస్ ను పకడ్బందీగా అమలుపరచుట,పాత పెన్షన్ పునరుద్ధరించుట కోసం పెద్ద ఎత్తున సభను నిర్వహిస్తున్నామని కావున ఉద్యోగులు తమంతట తాముగా చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ కార్యదర్శి పాలకుర్తి సదానందం,కోశాధికారి కిరణ్ కుమార్,సిటీ అధ్యక్షులు శంకేష్ రాజేష్,జిల్లా బాధ్యులు ఆనంద్,సతీష్,చిరంజీవి, గణేష్, సదానందం, నాగేశ్వరరావు,వంగ రవీందర్,నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సాంబయ్య కార్యదర్శి భాను ప్రకాష్ కోశాధికారి ఉదయ్,పంచాయతీ కార్యదర్శులు,తదితర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

---

# అక్రమ నిర్బంధాలు, అరెస్టులా ?

### అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన

### మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సబ్బండ వర్గాలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే సహించ లేని రేవంత్ సర్కార్ అక్రమ నిర్బంధాలు,అరెస్టులకు పాల్పడుతున్నారని దాస్యం అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో 420 హామీలను నిరసిస్తూ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ వినతి పత్రం సమర్పించారు.మహిళా ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా రాస్తారోకో,దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం మాట్లాడుతూ... 1000 రోజల పాలనలో రేవంత్ సర్కార్ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని 1000 రెట్లు కిందకు దించారన్నారు.కాంగ్రెస్ పార్టీ 100 రోజులో ఆమలు చేస్తాం అని 1000 రోజులు దాటినా 6 గ్యారంటీలు 420 హామీలు కార్యరూపం దాల్చలేదన్నారు.6 గ్యారంటీలు 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుంటే ప్రజల పక్షాన నిలబడి బీఆర్ఎస్ పార్టీ పోరుబాటకు బయలుదేరిందన్నారు.బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు 2 తేదీ నుంచి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ నిరసన తెలుపుతున్నాం,విద్యార్థుల నుంచి మొదలు వృద్ధుల వరకు రేవంత్ రెడ్డి పాలనను అసహ్యించుకుంటున్నారు.విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్,యువత ఉద్యోగాలు,కార్మికులకు ఉపాధి అవకాశాలలో,వృద్ధులకు,వికలాంగులకు పెన్షన్ లను ఇవ్వడం లో రేవంత్ సర్కార్ విఫలమైందని,స్వాతంత్ర్య దేశంలో కోట్లాడి





సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అఘాయిత్యాలకు అంతులేకుండా పోతుందన్నారు.నిన్న సాక్షాతూ అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలు మాజీ హోం మంత్రి సబితక్క,సునితక్క లపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులు వ్యవహరించిన తీరు సమాజానికి సిగ్గు చేటు అని,నిన్న అసెంబ్లీలో సీనియర్ నాయకులు కడియం శ్రీహరి ఉపన్యాసం హాస్యాస్పదంగా ఉందన్నారు.కెసిఆర్ దళితులు పట్టించుకోలేదు అంటే అయ్యా శ్రీహరినీ ఓడిపోయి మూలన కుర్చుంటే గల్లీ లో ఉన్న మిమ్మల్ని ఢిల్లీలో కుర్చోబెట్టింది కెసిఆర్ అని గుర్తు చేశారు.
దళిత నాయకు లైన మిమ్మల్ని ఉప ముఖ్యమంత్రిని చేసింది కెసిఆర్ కాదా అని ప్రశ్నించారు?సాటి దళితుడని చూడకుండా లేని పోని అభాండాలు వేసి రాజన్నను కించపరిచే తన డిప్యూటీ సీఎం పదవి ఎసరు పెట్టిన కన్నింగ్ కడియం శ్రీహరి అన్నారు.ఆనాడు గురువు చంద్రబాబు దగ్గర మొకరిల్లీ దళిత ఉద్యమాన్ని నీరు గార్చింది శ్రీహరి కాదా అని ప్రశ్నించారు?దళితుల ప్రేమతో కెసిఆర్ దళిత బంధు ఇచ్చిండు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో ఉన్న 12 లక్షల దళిత బంధు పై నిన్న అసెంబ్లీలో మీరు ప్రస్తావిస్తారు అనుకుంటే దళితులను ధనవంతులు చేసిన కేసిఆర్ ని విమర్శించారు అని ఎద్దేవా చేశారు.

---

## విద్యార్థులకు కరాటే శిక్షణ పునఃప్రారంభం




తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8: రామన్నపేట శోభనాద్రిపురం ఎంపీ యుపిఎస్ పాఠశాలలో ఫూలే అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే శిక్షణ పునఃప్రారంభించారు.సర్పంచ్ కంచి మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాస్టర్ చెన్నకేశవర్, ఇన్స్ట్రక్టర్ తెల్లాప్రసాద్ శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో ఆత్మరక్షణ, క్రమశిక్షణ పెంపే లక్ష్యమని నిర్వాహకులు ఎర్ర నరేష్ తెలిపారు.

## స్పీకర్ పై వ్యాఖ్యలు చేసిన తాతా మధును సస్పెండ్ చేయాలి

### - సుభాష్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ నిరసన



తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8:అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట సుభాష్ సెంటర్ లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి, ఉత్తటూరు సర్పంచ్ కోళ్ల రామకృష్ణ, బొడ్డు సాలయ్య, ఉపసర్పంచ్ బందెల నాగేష్, నోముల ప్రవీణ్, మేడి శ్రీనివాస్, నోముల విష్ణు, మేడిస్వామి, నోముల కృష్ణ, గ్యార కృష్ణ, చిప్పలపల్లి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం



తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8:
స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను టిఆర్పి తరఫున ఖండిస్తున్నామని మండల అధ్యక్షులు కళ్లెం ఉపేందర్ అన్నారు. ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసి అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

## దుబ్బాక-మునిపంపుల రోడ్డు గుంతలు పూడ్చాలి: సర్పంచుల డిమాండ్



తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8:దుబ్బాక-మునిపంపుల మధ్య ప్రమాదకరంగా మారిన రోడ్డు గుంతలను వెంటనే పూడ్చాలని మునిపంపుల, దుబ్బాక సర్పంచులు బొడ్డుపల్లి వెంకటేశం, గట్టు నర్సింహా డిమాండ్ చేశారు.ఆర్&బి కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో డీఈ ఖాళీ కుర్చీకి వినతి పత్రం ఇచ్చి వినూత్న నిరసన చేశారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించకుంటే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.



# ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా

**• బానోతు సుందర్ లాల్ దంపతుల కుమారుడు, కోడలికి హృదయపూర్వక అభినందనలు**




**తొలి అక్షరం/ఏన్కూర్ సెప్టెంబర్ 8:** ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బానోతు సుందర్ లాల్ కుమారుడు, కోడలికి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పార్టీ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత విద్యలో అత్యున్నతమైన పీహెచ్‌డీ పట్టాను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బానోతు సుందర్ లాల్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ కుమారుడు, కోడలు పీహెచ్‌డీ పట్టా సాధించడం తమ కుటుంబానికి ఎంతో గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యారంగంలో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పీహెచ్‌డీ పట్టా సాధించిన సందర్భంగా బానోతు సుందర్ లాల్ కుమారుడు, కోడలికి పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు.

# రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8:** రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జగదీష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మాదకద్రవ్యాలు యువత జీవితాలను ఎలా నాశనం చేస్తున్నాయో వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక సారథి కళాకారులు పాటల ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చంద్రమ్మ కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ

**- మృతురాలి కుటుంబానికి 5 వేల ఆర్థిక సహాయం అందజేత**




**తొలి అక్షరం/నర్సింహులపేట సెప్టెంబర్ 8:** నర్సింహులపేట గ్రామానికి చెందిన సూరబోయిన చంద్రమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ పెద్దమాముల యాకన్న, గ్రామ ఉపసర్పంచ్ కాస యాకయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు జినుకల రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రఘు రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబానికి ₹5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రేఖ అనిల్ యాదవ్, గ్రామ యూత్ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ యాదవ్, మండల యూత్ అధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్, జిల్లా నాయకులు అలవాల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏర్రనాగి వెంకన్న, శేరి గోపి, మున్వర్, లెక్కల సంపత్ రెడ్డి, జంపాల శ్రీకాంత్, మామిడి శెట్టి యాకన్న, ఎర్ర రవి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఫాంహౌస్‌పై దాడి నేపథ్యంలో ఉద్రిక్తత: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అరెస్ట్

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8:** మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేసిన నేపథ్యంలో సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు అడ్డుకున్నారు. రామన్నపేటలో ఆయన్ను అడ్డుకుని నల్లగొండ 11 టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే అక్రమ అరెస్టు విషయం తెలియగానే బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో రామన్నపేట మాజీ మండలాధ్యక్షుడు పోష బోయిన. మల్లేశం సర్పంచులు కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ గర్దాస్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు




## పర్యావరణ పరిరక్షణపై పోటీలు - ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11న



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8:** రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ఈ నెల 11న పర్యావరణ పరిరక్షణపై వివిధ పోటీలు నిర్వహిస్తున్న ట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాహత్ ఖానం తెలిపారు. జిల్లాలోని జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని, స్టోరీ రైటింగ్, స్లోగన్, ఫోటోగ్రఫీ, రీల్ మేకింగ్, క్విజ్, డిబేట్ పోటీలు ఉంటాయని తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. రంగస్థల నటుడు బాపనపల్లి వెంకటస్వామి ప్రత్యేక ఆకర్షణగా పాల్గొంటారని పేర్కొన్నారు.

# జనంపల్లిలో ఫారం పాండ్ పనుల పరిశీలన




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8:** జనంపల్లి గ్రామంలో జరుగుతున్న పారం పాండ్ పనులను అధికారులు పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలతో జరుగుతున్న పనుల తీరును, నాణ్యతను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, ఏపీవో వెంకన్న, పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధుపై కాంగ్రెస్ ఆగ్రహం

**- స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యలకు నిరసన.. ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్**



**తొలిఅక్షరం/నర్సింహులపేట సెప్టెంబర్ 8 :** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నర్సింహులపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టి బీఆర్ఎస్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జినుకల రమేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ప్రతీకగా ఉన్న అసెంబ్లీ స్పీకర్‌ను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్ పదవికి, దళిత సమాజానికి అవమానం కలిగించేలా మాట్లాడిన తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహులపేట గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ పెద్దమాముల కాసా యాకయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు దసరా నాయక్, గుండగాని వెంకన్న గౌడ్, మహబూబ్ ఖాన్, మండల సోషల్ మీడియా కన్వీనర్ చిర్ర సతీష్ గౌడ్, సీనియర్ నాయకులు అలవాల శ్రీనివాస్, ఏరంగి వెంకన్న, హరిలాల్, భాస్కర్ నాయక్, డోర్నకల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ యాదవ్, నర్సింహులపేట గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ యాదవ్, కౌసల్య దేవిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు గడ్డి వెంకట్ రెడ్డి, నర్సింహులపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు రఘు రెడ్డి, ముంగిమడుగు గ్రామ పార్టీ అధ్యక్షురాలు గాడిపెల్లి నాగమణి గౌడ్, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చల్ల మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సీత్లా భవాని తీజ్ ఉత్సవం

**• కుల పెద్దమనిషి అజ్మీర నందు నాయక్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం లోని అందుకుతండ గ్రామంలో సీత్లా భవాని తీజ్ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సాంప్రదాయ పండుగ తీజ్ గిరిజన ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ తో పాటు ఏడుగురు ప్రకృతి దేవతలను పూజిస్తారు. తీజ్ లో భాగంగా తొమ్మిది రోజులు దేవతలను పూజిస్తారు. పెళ్లి కానీ అమ్మాయిలు ఉపవాసం ఉంటూ ఆవు ఎరువు ను గుల్లలలో గోధుమలను పోస్తూ తొమ్మిది రోజులపాటు నియమ నిబంధనలతో పూజిస్తారు. సీత్లా భవాని తీజ్ బంజారా సమాజంలో ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే సంప్రదాయ పండుగ ముఖ్యంగా మహిళలు తీజ్ మొక్కలను పెంచి, పాటలు పాడుతూ, పూజలు నిర్వహిస్తూ కుటుంబ సుఖసంతోషాలు, ఆరోగ్యం, పంటల సమృద్ధి కోసం ప్రార్థిస్తారు. ఈ పండుగలో ప్రధానంగా తీజ్ మొక్కల పెంపకం, పూజ సీత్లా భవాని అమ్మవారి ఆరాధన తో బంజారా సంప్రదాయ నృత్యాలు, పాటల, సాంప్రదాయ బంజారా వస్త్రధారణ కుటుంబం, గ్రామం శ్రేయస్సు కోసం అందరు పూజిస్తారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దమనిషి అజ్మీర నందు నాయక్, కారోబార్ బానోత్ సీతారాం నాయక్, పూజారి రాజు నాయక్, అజ్మీర పెద్ద రాజు, బురో రాజు, కళ్యాణ్ సింగ్, బుజ్జా నాయక్, బానోత్ మున సమ్మయ్య, బిక్కు సమ్మయ్య, ఇస్లావత్ సమ్మయ్య, రమేష్, బాబ్లీ, సిత్తు, బద్రు, రఘు, బాలు, కుట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వాగ్దేవి మోడల్ యునైటెడ్ నేషన్స్ తెలంగాణ స్టేట్ మాక్ అసెంబ్లీ

**• ప్రజాస్వామ్యంపై యువతకు అవగాహన అవసరం: యువ నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన వాగ్దేవి మోడల్ యునైటెడ్ నేషన్స్(వి ఎ జి ఎం యు ఎం)తెలంగాణ స్టేట్ మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు యువ నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వాగ్దేవి మోడల్ యునైటెడ్ నేషన్స్, మాక్ అసెంబ్లీ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి, వాటిపై బాధ్యతాయుతంగా చర్చించడం, భిన్నాభిప్రాయాలను గౌరవించడం వంటి అంశాలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే సమాజంలోని సమస్యలపై అవగాహన పెంచుకుని, వాటి పరిష్కారానికి ఆలోచించే దృక్పథాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు వంటి అంశాలపై యువత చైతన్యంతో ఉండాలని అన్నారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజె పాడిల్స్ సైక్లింగ్ ఛాలెంజ్‌లో 500 కిలోమీటర్ల దూరాన్ని పూర్తిచేసిన జయరాజ్




**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** ఏజె పాడిల్స్ హన్మకొండ ఆధ్వర్యంలో నిర్వహించిన 30 రోజుల సైక్లింగ్ ఛాలెంజ్‌లో 500 కిలోమీటర్ల దూరాన్ని కేయూ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ పూర్తి చేసుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 80 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని సైతం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ (సీఏఆర్) అనంతయ్య చేతుల మీదుగా మెడల్ తో పాటు, ప్రశంసా పత్రం అందుకున్నారు. జయరాజ్ ప్రస్తుతం కేయూ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు.

# తాత మధు దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్ నేత దైద రవీందర్ డిమాండ్

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 8:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆయన దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ డిమాండ్ చేశారు. నకిరేకల్ మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడిన ఆయన, తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నేతలు చెనగోని రాజశేఖర్, జవాజీ ప్రమోద్, పందిరి సతీష్, వంటెపాక యాదగిరి, ఎండి యూసుఫ్, మాచర్ల శేఖర్, హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ఇండియాతో చారిత్రాత్మక పోరుకు
# జపాన్ జట్టు ప్రకటన



ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుడ-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది.మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేధ్యమైన జట్టును ప్రకటించింది.

# రూమర్లకు చెక్ పెట్టిన
# రాహుల్..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 మినీ వేలానికి ముందు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై నెలకొన్న ఎండ్ కార్డు పడింది. గత 2026 సీజన్ ముగిసిన నాటి నుంచి ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ గురించి పలు రకాల ప్రచారాలు జరిగాయి. ఇప్పటికే రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్లే భారీ ట్రేడ్ అధికారికంగా స్పష్టమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ కూడా వేరే ఫ్రాంచైజీలోకి వెళ్తాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే రాబోయే సీజన్‌లో తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే బరిలోకి దిగుతానని రాహుల్ స్వయంగా తేల్చిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ సోషల్ మీడియా వేదికగా రాహుల్‌ను ప్రశంసిస్తూ పెట్టిన పోస్ట్‌తో ఈ చర్చలకు తెరపడింది. రాహుల్‌ను అత్యుత్తమ క్లచ్ ప్లేయర్‌గా అభివర్ణించిన జిందాల్, ఫ్రాంచైజీతో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని రాసుకొచ్చాడు. "కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిజమైన ఆస్తి. జట్టు ప్రయోజనాలను ఎల్లప్పుడూ ముందుంచే వ్యక్తి. రాబోయే సీజన్‌లో ఢిల్లీని గర్వపడేలా చేయడానికి కలిసి శ్రమిస్తాం" అని జిందాల్ పేర్కొన్నాడు. దీనికి రాహుల్ స్పందిస్తూ "థ్యాంక్స్, వచ్చే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని బదులిచ్చాడు. దీంతో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలోనే కొనసాగుతాడన్న విషయం అధికారికంగా రూఢీ అయింది. 2025 సీజన్‌లో రూ. 14 కోట్లకు ఢిల్లీలో చేరిన రాహుల్, తొలి ఏడాది 539 రన్స్, 2026 సీజన్‌లో 593 రన్స్ చేసి అద్భుత ఫామ్ కనబరిచాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక మలుపు తిరిగింది. సరైన డీల్ కుదరకపోవడంతో హార్దిక్ మరో ఏడాది పాటు ముంబై ఇండియన్స్ జట్టులోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 2027 సీజన్ కోసం జట్టు నాయకత్వంలో మార్పులు జరగనున్నాయని, కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియలో మాజీ సారథి రోహిత్ శర్మ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ హార్దిక్ జట్టులో ఒక ఆటగాడిగా కొనసాగే అవకాశాలను ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది. ఫ్రాంచైజీలు తమ కోర్ గ్రూప్‌ను పటిష్టం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రిషభ్ పంత్ రీఎంట్రీ, రాహుల్ కొనసాగింపుతో ఢిల్లీ క్యాపిటల్స్ మరింత బలంగా మారగా, మిగిలిన జట్లు సైతం సమతుల్యత కోసం ట్రేడింగ్ మార్గాలను అన్వేషిస్తున్నాయి.



# కొత్తూరులో రూ.1.42 కోట్ల
# హాష్ ఆయిల్ పట్టివేత



● 11.319 కిలోల హాష్ ఆయిల్ స్వాధీనం.. ఒకరి అరెస్ట్ ● ఒడిశా నుంచి కొత్తూరుకు హాష్ ఆయిల్.. పోలీసుల సంయుక్త ఆపరేషన్

**తొలి అక్షరం/కొత్తూరు, సెప్టెంబర్08:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ జోన్ పరిధిలోని కొత్తూరులో భారీగా హాష్ ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఓటీ, కొత్తూరు పోలీసులు, షాద్‌నగర్ జోన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఇన్ముల్‌నర్వపీ అండ్ జీ కంపెనీ రోడ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న హెచ్. ధృవ్ అలియాస్ ధృవ్ జోషి (30)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని కాలేజ్ బ్యాగ్‌లో 11 ప్యాకెట్లలో మొత్తం 11.319 కిలోల హాష్ ఆయిల్ లభించింది. దీని విలువ సుమారు రూ.1.42 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు.విచారణలో ఒడిశాకు చెందిన రోహిత్ వద్ద నుంచి హాష్ ఆయిల్ తీసుకొచ్చి కొత్తూరు పరిధిలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు నిందితుడు వెల్లడించినట్లు సీఐ నాగార్జున తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఒక స్మార్ట్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. సరఫరా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 27న పింక్ పవర్ రన్




● పాల్గొననున్న 20 వేల మంది రన్నర్లు


**హైదరాబాద్ :** ఈ నెల 27న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరుగనుందని నిర్వాహకులు ఎంఈఐఎల్ డైరెక్టర్ సుధా రెడ్డి వెల్లడించారు. ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పింక్ పవర్ రన్ మూడో ఎడిషన్‌లో సుమారు 20 వేల మంది రన్నర్లు పోటీపడతారని, రూ.75 లక్షల భారీ నగదు బహుమతి అందించనున్నారు. పింక్ పవర్ రన్‌లో తొలిసారి హాఫ్ మారథాన్ (21.097 కిమీ) నిర్వహించనున్నారు. 10కె, 5కె, 3కె ఈవెంట్లు సైతం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో 2025 మిస్ వరల్డ్ ఒపల్ సుచతా చువాంత్, రొమ్ము క్యాన్సర్ సర్జన్ డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటితో కలిసి సుధా రెడ్డి పింక్ పవర్ రన్ జెర్సీ, మెడల్స్ ఆవిష్కరించారు.

# పట్టుబిగించిన ఈస్ట్ జోన్..

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖురైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు.



బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.




# చిరు కూతురు 'అమ్ములు'గా అనశ్వర..

## 'కాకా' నుంచి ఫస్ట్ లుక్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కాకా' నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో చిరంజీవి కూతురిగా నటిస్తున్న మలయాళ నటి అనశ్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా 'అమ్ములు' పాత్రను పరిచయం చేస్తూ ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. విడుదలైన పోస్టర్‌లో అనశ్వర రాజన్ మెడికల్ కాలేజీ విద్యార్థినిగా అమాయకమైన లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఆమె నవ్వుతూ కనిపిస్తుండగా, వెనుక రక్షణ కవచంలా మెగాస్టార్ చిరంజీవి నీడ కనిపిస్తోంది. ఈ పోస్టర్ కూతురి జీవితంలో తండ్రి ప్రాముఖ్యతను, వారి మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని తెలియజేసేలా ఉంది. సినిమాలో ఆమె పాత్ర కథాగమనంలో చాలా కీలకమని చిత్ర యూనిట్ పేర్కొంది. తన సహజ నటనతో మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ సినిమాలో అత్యంత ముఖ్యమైన పాత్రను దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు పెద్ద ప్లస్ కానుంది.

బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ వేగంగా జరుగుతోంది. తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో పాటు మాస్ యాక్షన్ అంశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు

# చరిత్రలో తొలిసారి..

## ఢిల్లీ దాటుతున్న జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుక




జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం విషయంలో దశాబ్దాలుగా పాటిస్తున్న సంప్రదాయానికి ఈ ఏడాది తెరపడనుంది. చరిత్రలో తొలిసారిగా ఈ ప్రతిష్ఠాత్మక వేడుకను దేశ రాజధాని ఢిల్లీ నుంచి తరలిస్తున్నారు. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమాన్ని గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉన్న ప్రదేశం ఇదే కావడం గమనార్హం.

ఈ నెలలో గుజరాత్ పర్యటనకు వెళ్లనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అక్కడే అవార్డులను ప్రదానం చేస్తారని తెలుస్తోంది. పర్యటనలో భాగంగా ఆమె ఏక్తా నగర్‌కు వెళ్లి విజేతలకు పురస్కారాలు అందజేయనున్నట్టు సమాచారం. సాధారణంగా ఏటా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. అయితే, ఈసారి అందుకు భిన్నంగా వేదికను మార్చడం ప్రాధాన్యం సంతరించుకుంది.

2024 సంవత్సరానికి గాను 72వ జాతీయ చలనచిత్ర అవార్డులను జులై నెలలో ఢిల్లీలో ప్రకటించారు. 'ఆర్టికల్ 370' ఉత్తమ చిత్రంగా నిలవగా, యామీ గౌతమ్ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. మలయాళ అగ్రనటుడు మమ్ముట్టి, బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్ ఉత్తమ నటుడి అవార్డును పంచుకున్నారు. కాగా, 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ – ఏక్తా కా ప్రతీక్' అనే చిత్రానికి గాను దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ నాన్-ఫీచర్ విభాగంలో ఉత్తమ దర్శకత్వ పురస్కారం అందుకోవడం విశేషం.



# చీరకట్టులో ఆకట్టుకుంటున్న ఆషికా రంగనాథ్..

కన్నడ నటిగా పాపులారిటీ అందుకున్న ఆషికా రంగనాథ్ తొలిసారి కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా వచ్చిన అమీగోస్ అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. సినిమా డిజాస్టర్ గా నిలిచినా అందరి దృష్టి అమ్మడి పైనే. తన నటనతో, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. మళ్లీ 2026లో భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమాలో నటించింది . ఈ సినిమా కూడా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ప్రస్తుతం వశిష్ట మల్లిడి దర్శకత్వంలో విశ్వంభర అనే సినిమా చేస్తోంది. కానీ ఈ సినిమా విడుదలకు నోచుకోలేదు. దీంతో రూట్ మార్చిన ఈమె.. తమిళంలో తాజాగా నటిస్తున్న చిత్రం సర్దార్ 2 . సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో అటు ప్రమోషనల్ కార్యక్రమాలతో పాటు ఇటు సోషల్ మీడియా వేదికగా సందడి చేస్తూ అలరిస్తోంది. ఈ మేరకు తాజాగా చీరకట్టులో ఆడియన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ఆషికా రంగనాథ్. బ్లాక్ అండ్ వైట్ జీబ్రా కలర్స్ తో డిజైన్ చేసిన జార్జెట్ చీర కట్టుకున్న ఈమె.. దీనికి కాంబినేషన్లో పోల్కా డాటెడ్ తో డిజైన్ చేసిన డీప్ రౌండ్ నెక్ కలిగిన బ్లౌజ్ ధరించి తన అందాలను ఫుల్ ఫిల్ చేసుకుందిహైదరాబాదులో సెప్టెంబర్ 7న జరిగిన సర్దార్- 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం ఇలా ముస్తాబయింది ఈ ముద్దుగుమ్మ. చీర కట్టులో నడుము అందాలతో చక్కగా ప్రేక్షకులను మైమరిపింప చేసిన ఆషికా రంగనాథ్ ఈ ఫోటోలకు క్యాప్షన్ గా సినిమాటిక్ గా ఉందా? హైదరాబాదులో సర్దార్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం ఈ లుక్ అంటూ షేర్ చేసిన క్యాప్షన్ ఆకట్టుకుంటుంది. మొత్తానికి అయితే ఆషికా రంగనాథ్ షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే ప్రీ రిలీజ్ ఈవెంట్లో తన అంద చందాలతో ఆషికా ఆకట్టుకున్న విషయం తెలిసిందే

పిఎస్ మిత్రాన్ దర్శకత్వంలో గతంలో వచ్చిన సర్దార్ మూవీకి సీక్వెల్ గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తమిళ్ భాష స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రాబోతున్న ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్, ఐవి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై నిర్మించారు. ఇందులో కార్తీ సరసన రజీషా విజయన్ తన మునుపటి పాత్రనే తిరిగి పోషిస్తుండగా.. మాళవిక మోహనన్.. ఆషికా రంగనాథ్ ఈ చిత్రంలో అదనంగా చేరారు.. ఈ చిత్రానికి సిఎస్ సంగీతాన్ని అందిస్తుండగా .. జార్జ్ సి విలియమ్స్ సినిమాటోగ్రఫీ అందించారు. విజయ్ వెళకుట్టి ఎడిటింగ్ నిర్వహించారు. భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 10న రాబోతున్న ఈ సర్దార్ 2.. సర్దార్ కు మించి సక్సెస్ అందుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# 75 ఏళ్ల వయసులోనూ ఫిట్‌నెస్ ఐకాన్..

## మమ్ముట్టి యంగ్ లుక్



మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి సెప్టెంబర్ 7న 75వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ వయసులోనూ ఆయన ఫిట్‌నెస్, యంగ్ లుక్ చూసి సినీ పరిశ్రమ, అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. కండరాల బలం, శారీరక చురుకుదనం సహజంగా తగ్గే వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండటం వెనుక ఒక క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఉంది. పరిమితంగా ఆహారం తీసుకోవడం, క్రమం తప్పని వ్యాయామం, సరైన నిద్ర వంటి అలవాట్లే ఆయన ఫిట్‌నెస్ రహస్యాలుగా తెలుస్తోంది.

**సూర్యకు స్ఫూర్తినిచ్చిన మమ్ముట్టి**

తమిళ స్టార్ హీరో సూర్య సైతం మమ్ముట్టి ఆహారపు అలవాట్ల నుంచి స్ఫూర్తి పొందినట్లు గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. "ఇష్టమైనది ఏదైనా తినొచ్చు, కానీ ఇష్టమొచ్చినంత తినకూడదు, కడుపు సగం నిండే వరకే తినాలి" అని మమ్ముట్టి తనకు సలహా ఇచ్చినట్లు సూర్య గుర్తుచేసుకున్నారు. పూర్తిగా మానేయడం కంటే, పరిమితంగా తినడమే మమ్ముట్టి డైట్‌లో కీలక సూత్రం.

**డైట్ ప్లాన్ ఎలా ఉంటుంది?**

కొన్ని నివేదికల ప్రకారం, మమ్ముట్టి నూనెలో వేయించిన పదార్థాలకు, చక్కెర, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉంటారు. పండ్లు, కూరగాయలు, గుడ్లు, చేపలు, నట్స్ వంటి పోషకాహారానికి ప్రాధాన్యత ఇస్తారు. ఉదయం అల్పాహారంలో ఓట్స్ జావ, గుడ్డులోని తెల్లసొన, బొప్పాయి, నానబెట్టిన బాదం వంటివి తీసుకుంటారు. మధ్యాహ్నం అన్నానికి బదులుగా ఓట్స్ పుట్టుతో పాటు తక్కువ మసాలాతో వండిన చేపల కూర తింటారు. రాత్రిపూట గోధుమ లేదా ఓట్స్ దోశలతో చికెన్ లేదా చేపల కూర తీసుకుని, తేలికపాటి ఆహారంతో సరిపెడతారు. ఆయన వ్యక్తిగత చెఫ్ చెప్పిన ప్రకారం, వేయించిన చేపల కంటే చేపల పులుసునే ఆయన ఇష్టపడతారు.

**వ్యాయామం, నిద్రకు అధిక ప్రాధాన్యం**

ఆహార నియమాలతో పాటు, మమ్ముట్టి రోజూ జిమ్‌లో వర్కౌట్లు చేస్తారు. వయసు పెరిగేకొద్దీ కండరాల బలం తగ్గకుండా ఉండేందుకు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో వ్యాయామాలు చేస్తుంటారు. ఫిట్‌నెస్ విషయంలో వ్యాయామం ఎంత ముఖ్యమో, శరీరానికి సరైన విశ్రాంతి కూడా అంతే అవసరమని ఆయన నమ్ముతారు. అందుకే, షూటింగ్ షెడ్యూల్స్ ఎంత బిజీగా ఉన్నా, సరైన సమయానికి నిద్రపోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు.

మమ్ముట్టి 75వ పుట్టినరోజు సందర్భంగా ఆయన కొత్త చిత్రం 'మేళా' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఒకవైపు నటుడిగా రాణిస్తూనే, మరోవైపు ఆరోగ్యకరమైన జీవనశైలితో ఆయన ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# పిఠాపురంలో అలా మొదలైంది..

## మళ్లీ ఫ్యామిలీ కథతో మహేష్ చంద్ర



ప్రేయసి రావే సినిమాతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మహేష్ చంద్ర ఇప్పుడు మరో ఫ్యామిలీ కథతో వస్తున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన పిఠాపురంలో అలా మొదలైంది సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుంది. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తోంది. టైటిల్ నుంచే కథకు పిఠాపురం నేపథ్యం ఉందని అర్థమవుతోంది. ప్రేమ, కుటుంబం, సరదా సన్నివేశాలతో పాటు తండ్రి, కూతురు మధ్య అనుబంధం ఈ కథలో ముఖ్యంగా ఉండబోతోంది. 00:05 / 02:25 రాజేంద్ర ప్రసాద్ ఇందులో కీలక పాత్రలో నటించారు. పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మతో పాటు సన్నీ అఖిల్, విరాట్, జూనియర్ పవన్ కల్యాణ్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇతర




పాత్రల్లో కనిపించనున్నారు. ఒక కుటుంబంలో మనకు రోజూ ఎదురయ్యే మనుషులు, పరిస్థితులకు దగ్గరగా పాత్రలను రాసినట్టు దర్శకుడు చెబుతున్నారు. ఇప్పటి యువతకు చెప్పాల్సిన ఒక విషయాన్ని కూడా కథలో భాగంగా తీసుకున్నారట. మహేష్ చంద్ర పేరు చెప్పగానే చాలామందికి ప్రేయసి రావే గుర్తుకొస్తుంది. ప్రేమకథతో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ తో వచ్చిన ఆ సినిమా అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు కూడా ఆయన పూర్తిగా కుటుంబ కథనే ఎంచుకున్నారు. కాకపోతే ఈసారి తండ్రి, కూతురు బంధాన్ని కథలో హైలెట్ చేశారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌లో కూడా ఇంట్లో జరిగే సరదా గొడవలు, పెళ్లి చుట్టూ వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.